క్లుప్తంగా

ఉర్దూ మాధ్యమంలోనే బోధించాలి

ఫిరంగిపురం: ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు తప్పనిసరిగా ఉర్దూ మాధ్యమంలోనే బోధించాలని ఉర్దూ డీఐ ఎండీ ఖాసిం అన్నారు. మండలంలోని పొనుగుపాడు ప్రాథమిక ఉర్దూ పాఠశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీచేశారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు, విద్యార్థుల హాజరుశాతం, ఉపాధ్యాయుల అటెండెన్స్ రిజిష్టర్లు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులకు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల హాజరుశాతం తగ్గకుండా ఉండేలా విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని చెప్పారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

ఫిరంగిపురం: రానున్న వర్షాల ప్రభావంతో పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని వ్యవసాయశాఖ ఏఓ రమణకుమార్ రైతులకు సూచించారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొలాల్లోని కల్లాల్లో ఉన్న మిర్చిపంటపై పరదాలు వేసుకోవడం కాని లేదా సురక్షిత ప్రాంతాలకు తరలించడంకాని చేయాలని సూచించారు. శనగలు కోసి మండెలు వేసి ఉన్నవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని లేనిచో పంట కుళ్లిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. రైతులు దీనిని గమనించి తగిన జాగ్రత్తలు పాటించి పంటను కాపాడుకోవాలన్నారు.

ముస్లిం బాలబాలికలకు ఖురాన్‌పై శిక్షణ

మంగళగిరి: నగర పరిధిలోని పెదవడ్లపూడి ముస్లిం ఐక్య వేదిక కార్యాలయంలో ఈ నెల 22వ తేదీ నుంచి రంజాన్ మాసం ప్రారంభం కానున్న దృష్ట్యా ముస్లిం బాలబాలికలకు ఖురాన్‌పై శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారు. రంజాన్ మాసం నెలపాటు 30 మంది బాలబాలికలకు శిక్షణ ఇవ్వనున్నట్లు మత గురువు ఎండీ మాకరిన్ బాల తెలిపారు.

ఘనంగా క్రీస్తు శిలువ ధ్యానం



ముళ్ల కిరీటంతో శిలువను మోస్తూ పాదయాత్ర చేస్తున్న విశ్వాసులు

పెదపరిమి(తాడికొండ): క్రైస్తవుల 40 రోజుల తపస్సు కాలాన్ని పురస్కరించుకొని తుళ్ళూరు మండలం పెదపరిమి గ్రామంలో నిర్వహించిన క్రీస్తు శిలువ ధ్యానం, పాదయాత్ర ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా క్రీస్తు శిలువ శ్రమలను ధ్యానిస్తూ అనంతవరం, నెక్కల్లు, తుళ్లూరు, పెదపరిమి, బడేపురం గ్రామాలకు చెందిన క్రైస్తవ సంఘాలు పాదయాత్రలో పాల్గొన్నారు. మానవాళి రక్షణ కోసం ప్రజల బాధలను, పాపాలను తనపై వేసుకొని తలకు ముళ్ల కిరీటంతో శిలువను మోస్తూ కొరడా దెబ్బలు తింటూ శిలువను మోసి బటుల చేతిలో క్రూరంగా హింసించబడి సమాధి చేయబడిన క్రీస్తు శిలువ మార్గం సన్నివేశాన్ని ఆకట్టుకునేలా విశ్వాసులు పాదయాత్రలో పాల్గొన్నారు. శిలువను మోస్తున్న ఏసుక్రీస్తు, భటుల వేషధారణలు ఆకట్టుకున్నాయి, అన్ని గ్రామాల నుంచి పాదయాత్రగా వచ్చిన విశ్వాసులు పెదపరిమిలోని సంతాన మాత పుణ్యక్షేత్రానికి చేరుకొని చర్చి ఆవరణలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆలయంలో యర్ల పాడుకు చెందిన ఫాదర్ పాస్టర్ బోస్ క్రీస్తు వాక్య పరిచర్య చేయగా సంతానమాత పుణ్య క్షేత్రం ఫాదర్ మాదినేని జ్ఞాన ప్రకాష్, అనంతవరం ఫాదర్ అనీల్, తుళ్లూరు ఫాదరి దాసరి తంబి, నిడుముక్కల ఫాదర్ సుధీర్ పలువురు భక్తులు పాల్గొన్నారు.

నష్టపరిహారంగా లక్ష చెల్లించండి

గుంటూరు లీగల్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా క్రెడిట్ కార్డు విభాగం ఫిర్యాది పి.సుకుమార్‌కు రూ.1,35,453 చెల్లించాలని గుంటూరు జిల్లా వినియోగదారుల కమిషన్ గురువారం ఆదేశించింది. గుంటూరులోని చంద్రమౌళీనగర్‌కు చెందిన సుకుమార్ ఎస్‌బీఐలో చీఫ్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఆయన ఎస్‌బీఐ క్రెడిట్ కార్డును తీసుకొని లావాదేవీలు జరుపుతున్నారు. దాన్నుంచి ఆయనకు తెలియకుండా రూ.32,453 కట్ అయ్యాయి. ఈ విషయం నెలవారీ స్టేట్‌మెంట్‌లో తెలిసిన వెంటనే ఎస్‌బీఐని సంప్రదించారు. ఓటీపీ రాకుండానే డబ్బులు కట్ అయినందున తిరిగి తన ఖాతాకు జమ చేయాలని కోరారు. నోటీసులు కూడా పంపించారు. ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు విభాగం తమకు సంబంధం లేదని సమాధానం పంపింది. దీంతో సుకుమార్ వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఇరువురి వాదనలు విన్న కమిషన్ అధ్యక్షురాలు తాడికొండ సునీత, సభ్యులు కె.విజయలక్ష్మి, జి.పున్నారెడ్డి తీర్పు వెలువరించారు. ఫిర్యాది సుకుమార్‌కు క్రెడిట్ కార్డు నుంచి కట్ అయిన రూ.32,453తో పాటు నష్టపరిహారం కింద రూ.1లక్ష, ఫిర్యాదు ఖర్చుల కింద రూ.3వేలు ఆర్నెలల్లో చెల్లించాలని ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు విభాగం వారిని ఆదేశించారు. ఫిర్యాదు తరఫున న్యాయవాది డి.రవీంద్రబాబు వాదించారు.

తీరనున్న తాగునీటి కష్టాలు

- కొద్ది రోజులలో పూర్తి కానున్న తాగునీటి పథకం
- రూ.2.50 కోట్లతో చేపట్టిన పనులు
- మోటార్లు కొనుగోలు చేసిన అధికారులు
- కృష్ణానది నుంచి నేరుగా పథకానికి నీటి సరఫరా
- త్వరితగతిన పూర్తిచేసి త్రాగునీరు సరఫరా చేయాలన్న ఎమ్మెల్యే ఆర్కే



నూతన మోటర్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: మంగళగిరి వాసుల తాగునీటి కష్టాలు తీరనున్నాయి. కోట్లాది రూపాయలతో చేపట్టిన తాగునీటి పథకం పనులు తుది దశకు చేరాయి. మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థగా అవతరించిన నేపథ్యంలో నగర జనాభా రోజురోజుకు పెరుగుతుంది. మంగళగిరి పట్టణంలో సుమారు మూడు లక్షల జనాభా ఉండగా 26,500 వేల నివాసాలు ఉన్నాయి. మంగళగిరి నగర ప్రజలకు తాగునీరు అందించేందుకు ఆత్మకూరు వద్ద గుంటూరు చానల్‌పై తాగునీటి పథకం ఉండగా ఇప్పటివరకు కృష్ణానది నుంచి గుంటూరు నగరానికి వెళ్లే పైపులైను నుంచి నీటిని సంపులకు తరలించి శుద్ధి చేసి అక్కడ నుంచి రిజర్వాయర్‌కు తరలించి సరఫరా చేసేవారు. గుంటూరు నగరానికి అధికంగా నీరు వెళ్లిన సమయంలో మంగళగిరి పథకానికి నీరు అందేది కాదు. దీంతో నగర వాసులకు సక్రమంగా నీరు అందక అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చొరవ తీసుకుని తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టారు. కృష్ణా నది నుంచి నేరుగా మంగళగిరి తాగునీటి పథకానికి నీరు సరఫరా చేసేలా పైపులైను నిర్మాణం చేపట్టారు. దీంతో ఇక తగినంత నీరు నేరుగా సరఫరా అవుతుంది. ప్రస్తుతం మంగళగిరి ప్రజలకు 9 ఎంఎల్‌డి నీరు సరఫరా అవుతుండడంతో పూర్తిస్థాయిలో సరఫరా చేయలేకపోతున్నారు. మరో 3 ఎంఎల్‌డీ కలిపి మొత్తం 12 ఎంఎల్‌డీ నీరు సరఫరా చేసేలా కొత్తగా తాగునీటి పథకం వద్ద రెండు సంపులు నిర్మించారు. ఒక సంపుకు గుంటూరు చానల్ నుంచి నేరుగా నీరు సరఫరా అవుతుంది. ఈ నీటిని రెండవ సంపునకు తరలించి శుద్ధి చేసి అక్కడ నుంచి రిజర్వాయర్‌కు పంపి పైపులైన్ల ద్వారా నివాసాలకు సరఫరా చేయనున్నారు. రూ.2.50 కోట్లతో చేపట్టిన సంపు నిర్మాణాలు పూర్తవుతుండగా రిజర్వాయర్ నుంచి కొప్పురావూరు కాలనీ ఓవర్‌హెడ్ ట్యాంక్ వరకు పైపులైను నిర్మాణం పూర్తి చేశారు. ఇప్పటికే అధికారులు నూతన మోటార్లను కొనుగోలు చేయగా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) మూడు 30 హెచ్‌పీ మోటర్లు, రెండు 75 హెచ్‌పీ మోటర్లను పరిశీలించి మరింత వేగవంతంగా పనులు పూర్తిచేసి ప్రజలకు తాగునీరు సరఫరా పూర్తిస్థాయిలో చేయాలని అధికారులకు సూచించారు. పథకం పూర్తయితే వేసవిలోనూ పూర్తిస్థాయిలో తాగునీటిని సరఫరా చేయగలమని నగరపాలక అధికారులు చెబుతున్నారు.



పూర్తి కావస్తున్న సంపుల నిర్మాణం

కొద్ది రోజుల్లోనే పనులు పూర్తి

కొద్ది రోజులలోనే తాగునీటి పథకం నిర్మాణ పనులు పూర్తిచేస్తాం. మంగళగిరి నగర ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పిస్తాం.

– యు శారదాదేవి, కమిషనర్, నగర పాలక సంస్థ

మందపాడు పీహెచ్‌సీకి అవార్డు



డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రావణ్‌బాబు నుంచి అవార్డు అందుకుంటున్న సర్పంచ్

మేడికొండూరు: మండలంలోని మందపాడు గ్రామ ప్రాథమిక ఆరోగ్యవైద్యకేంద్రానికి ఎన్క్వాస్ అవార్డు దక్కింది. గత సంవత్సరం ఏప్రిల్ నెలలో జాతీయ వైద్య ఆరోగ్యబృందం మందపాడు ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించింది. మౌలిక సదుపాయాలను, ఆసుపత్రి పనితీరు పరిశీలించిన బృందం నివేదికను జాతీయ ఆరోగ్య వైద్య ఆరోగ్యకేంద్రం శాఖకు అందించింది. ఈ నివేదిక ఆధారంగా జిల్లాలో మందపాడు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి ఎన్నిక కావడంతో, ప్రతి సంవత్సరం ఆసుపత్రి అభివృద్ధికి రూ.3లక్షలు ప్రతి ఏటా గవర్నమెంట్ ఆఫ్ ఇండియా తరుపున రావడ జరుగుతుందని మందపాడు గ్రామ సర్పంచ్ ఆవుల సంజీవరెడ్డి తెలిపారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రావణ్‌బాబు చేతుల మీదుగా అవార్డును సర్పంచ్ సంజీవరెడ్డి అందుకున్నారు. అవార్డు రావడంపై మందపాడు గ్రామస్తులు హర్షం వ్యక్తపరిచారు.

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది

- వైఎస్సార్ సీపీ నాయకులు
- ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో జయంతి వేడుకలు



ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్దనివాళులర్పిస్తున్న నాయకులు



తాడేపల్లిలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్ నాగిరెడ్డి



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



తాడికొండలో పొట్టి శ్రీ రాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

మంగళగిరి: ఆంధ్ర రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ నాయకులు కొనియాడారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా నగర పరిధిలోని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) కార్యాలయంలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు తన ప్రాణాలను త్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు సంకా బాలాజీ గుప్తా, ఎండీ ఫిరోజ్, బొమ్ము శివరామిరెడ్డి, మద్దుల శివప్రసాద్, నేరెళ్ల మురళి, కందుకూరి గోపాలకృష్ణమూర్తి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నగర పాలక సంస్థ కార్యాలయంలో ..

పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా నగర పాలక సంస్థ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కమిషనర్ యు శారదాదేవి, అడిషనల్ కమిషనర్ హేమమాలినిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరాజు, వివిధ విభాగాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీఎస్పీ ఆరవ బెటాలియన్‌లో..

నగర పరిధిలోని ఏపీఎస్పీ ఆరవ బెటాలియన్‌లో పొట్టి శ్రీరాములు జయంతి ఘనంగా నిర్వహించారు. ఏపీఎస్పీ ఆరవ బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ సీహెచ్ వెంకటేశ్వర్లు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ ఈఎస్ సాయిప్రసాద్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిలో...

తాడేపల్లిరూరల్ : అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను గురువారం తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత పొట్టి శ్రీరాములు చిత్రపటానికి తహసీల్దార్ నాగిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రశాంతి, డిప్యూటీ తహసీల్దార్ సతీష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి ఉత్సవాన్ని దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని గ్రామంలోని గ్రంథాలయంలో విలేజ్ డెవలప్‌మెంట్ ఫోరం కన్వీనర్ ఇంగువ కృష్ణమూర్తి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీటీసీ సభ్యులు పసుపులేటి సాయి చైతన్య, యూనియన్ బ్యాంక్ మేనేజర్ కె.కృష్ణప్రసాద్‌లు విచ్చేశారు. తొలుత పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు, ఫెన్సిళ్లు, పెన్నులు అందజేశారు. ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.ఏడుకొండలు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు ఎం.శారద, వెంకట సుబ్బారావు, సీహెచ్ లక్ష్మీ పద్మావతి పాల్గొన్నారు.

తాడికొండ మండలంలో...

తాడికొండ: ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాన్ని పణంగా పెట్టి అసువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీ రాములు త్యాగం మరువలేనిదని ఆర్యవైశ్య నాయకులు అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని గురువారం తాడికొండ గాంధీబొమ్మ కూడలిలోని విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు బుశ్శెట్టి వెంకటేశ్వరరావు, చుండూరు నాగేశ్వరరావు, వెంకట్రావు పాల్గొన్నారు.

– తాడికొండ శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన అమరజీవి జయంతి వేడుకలకు సీపీఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు ముఖ్య అతిథిగా హాజరై గ్రంథాలయాధికారి గింజుపల్లి శ్రీనివాసరావుతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానికులు గుంటూరు ఏమేశ్వరరావు, సత్యనారాయణ, ప్రభాకరరావు, గంగాధర్ పాల్గొన్నారు.

మేడికొండూరు: మండల పరిధిలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మన్నవ స్వప్న అధ్యక్షతన ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సభ నిర్వహించారు. ఎంపీడీఓ శోభారాణి, ఈఓపీఆర్డీ రవికుమార్, శారద, దివ్యలు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అన్ని వర్గాల బడ్జెట్

మంగళగిరి :రాష్ట ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల బడ్జెట్‌గా పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టగా అన్ని రంగాలకు ప్రాధాన్యమిస్తూ పేదలకు ఆర్థికాభివృద్ధికి తోడ్పడేలా బడ్జెట్ ఉందన్నారు.

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి దోహదం



రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి దోహదపడేలా ఉంది. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి అధికంగా నిధులు కేటాయించడం అభినందనీయం. ప్రజలందరికి నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందించడం, వ్యవసాయ, పారిశ్రామికరంగాల అభివృద్ధి తోడ్పాటుకు భారీగా నిధులు కేటాయించడం, మహిళల అభివృద్ధికి చేయూతతో సమాజంలో అసమానతలు తొలగించి పేదరికాన్ని రూపుమాపే బడ్జెట్.

– ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్యే

సమ సమాజానికి నాంది



వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు పేదల అభివృద్ధికి, సంక్షేమ పథకాలకు నిధులు భారీగా కేటాయించారు. సమ సమాజ నిర్మాణానికి నాంది పలుకుతుంది.

–ఇసునూరు అనిల్ చక్రవర్తి, ఆడిటర్

అనుమతి లేని లే అవుట్లపై సీఆర్డీయే అధికారుల కొరఢా

- నాలుగు లే అవుట్లలో రోడ్లు తొలగింపు
- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

లాం(తాడికొండ): తాడికొండ మండలం లాం గ్రామంలో అనుమతి లేని లే అవుట్లపై సీఆర్డీయే అధికారులు కొరఢా ఝళిపించారు. సర్వే నెంబర్ 308, 310, 99, 310/4 లో ఎలాంటి అనుమతులు లేకుండా ప్లాట్లు వేసి విక్రయిస్తున్న నాలుగు లే అవుట్లలో రోడ్లు, హద్దు రాళ్లు, తొలగించి అనధికారి లే అవుట్ పేరుతో బోర్డులు ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ అనధికారిక లే అవుట్లు అభివృద్ధి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని తొలగించేందుకు అయిన ఖర్చులు కూడా ప్లాట్ల యజమానుల నుంచే వసూలు చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. లే అవుట్లు వేసే యజమానులు సీఆర్డీయే, పంచాయతీ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని లేకుంటే ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి అనుమతులు, ప్లాను మంజూరు, లోన్లు మంజూరు చేయబడవు కావున కొనుగోలుదారులు గమనించాలన్నారు. కార్యక్రమంలో సీఆర్డీయే డిప్యూటీ డైరెక్టర్ సుబ్బారెడ్డి,, అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ స్టాలిన్, పంచాయతీ కార్యదర్శి వి రవి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



లాంలో అనధికారి లే అవుట్‌లో బోర్డులు ఏర్పాటు చేసిన అధికారులు

కృష్ణానది ఎగువ ప్రాంతంలో అక్రమ ర్యాంప్‌లు

- నిర్లక్ష్యంగా ఇరిగేషన్ అధికారులు
- ఒక చోట కొత్త ర్యాంప్, మరో చోట మరమ్మతులు



కరకట్ట లోపలివైపు వేస్తున్న కొత్త ర్యాంప్

తాడేపల్లిరూరల్ : కృష్ణానది ఎగువ ప్రాంతంలో అమరావతి కరకట్ట వెంబడి ప్రభుత్వం కరకట్టను వెడల్పు చేసేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతూ ప్రకాశం బ్యారేజ్ నుంచి అమరావతి వెళ్లే రోడ్డులో ఎడమవైపు పంట పొలాలను సేకరించి రోడ్డు నిర్మాణ పనులు చేపడుతోంది. అవకాశం ఉన్నప్పటికీ రివర్ కన్జర్వేటర్ (నదీతీర ప్రాంతం)లో రోడ్డు నిర్మించకూడదని ఇరిగేషన్ ఉన్నతాధికారులు ఆదేశించడంతో ఎడమ వైపు మాత్రమే పనులు చేపట్టారు. ఇదిలా ఉండగా రివర్ కన్జర్వేటర్‌లో కొంతమంది వ్యక్తులు అనధికార ర్యాంప్‌లను ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టారు. గురువారం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నా ఆ పనులు నిలిపివేయకుండా యథేచ్ఛగా నదీ పరివాహక ప్రాంతంలో ర్యాంప్‌లు ఏర్పాటుచేయడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. కృష్ణానది కరకట్ట లోపల ఉన్న అక్రమ కట్టడాలకు ఒక వైపు ప్రభుత్వం నోటీసులు ఇస్తుంటే మరోవైపు అధికారుల నిర్లక్ష్యం వల్ల కొత్త ర్యాంప్‌ల ఏర్పాటుకు అక్రమార్కులు శ్రీకారం చుట్టారు. 1835 రిజర్వ్ కన్జవేటర్ యాక్ట్ ప్రకారం నదీ తీరంలో భవనాలు గానీ, కట్టడాలు గానీ నిర్మించకూడదని ఇరిగేషన్ అధికారులే అప్పుడప్పుడు మాట్లాడుతూ ఉంటారు. జరుగుతున్న ర్యాంప్‌ల నిర్మాణంపై ఇరిగేషన్ ఈఈ కృష్ణారావును వివరణ అడిగేందుకు ఫోన్ చేయగా మొదట అటువంటి నిర్మాణాలు జరగలేదని, ఆ తరువాత పరిశీలించి చెబుతామని సమాధానం ఇచ్చారు. కృష్ణారావుకు కాల్ చేసినా, జరుగుతున్న అక్రమ ర్యాంప్ నిర్మాణం ఫొటోలు వాట్సప్ చేసినా ఎటువంటి సమాధానం ఇవ్వకపోవడం గమనార్హం.

సంక్షేమం, సుపరిపాలనే ధ్యేయంగా బడ్జెట్

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్

తాడికొండ: సంక్షేమం, సుపరిపాలనే ధ్యేయంగా 2023–24 బడ్జెట్లో ప్రభుత్వం భావితరాలకు బాటలు వేసి పేదవాడి కలలను సాకారం చేసే దిశగా అడుగులు వేసిందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. గురువారం ఏపీ అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ సమాజంలో అసమానతలు తగ్గించి పేదరికాన్ని రూపుమాపి భావితరాలకు బంగారు బాటలు వేస్తుందనడంలో సందేహం లేదన్నారు. సంక్షేమ పథకాలకు రూ.54,228.36 కోట్లు కేటాయించడం పేదల పట్ల జగనన్నకు ఉన్న ప్రేమ, ఆదరాభిమానాలకు నిదర్శనమన్నారు.

ఆర్బీకేల్లో పశువిజ్ఞాన బడులు తప్పనిసరి

ఫిరంగిపురం: నెలలో ఒకసారి ఆర్బీకే కేంద్రాల్లో పశువిజ్ఞాన బడులు తప్పనిసరిగా నిర్వహించి పాడి రైతులకు పశువుల పెంపకంపై అవగాహన కల్పించాలని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణ అన్నారు. మండలంలోని నుదురుపాడు పశువైద్యశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రకాల రిజిస్టర్‌లు పరిశీలించారు. సిబ్బంది పనితీరు, రిజిస్టర్ల నిర్వహణను పరిశీలించి ఇప్పటివరకు పశు వైద్యశాలలో అందించిన సేవల వివరాలు పశువైద్యుడు నూర్ అహ్మద్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బేతపూడి, వేమవరం, యర్రగుంట్లపాడు గ్రామాల్లోని ఆర్బీకే కేంద్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతినెలా ఆయా గ్రామాల్లోని ఆర్బీకే కేంద్రాల్లో తప్పనిసరిగా పాడి రైతులకు పశువుల పెంపకం, దాణ, అనారోగ్య సమస్యలు గుర్తించడం, టీకాల వివరాలపై సిబ్బంది అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రతినెలా వాటిని పశువైద్యాధికారి పర్యవేక్షిస్తూ ఆయా సమయాల్లో వచ్చిన కేసులను చూడాలన్నారు. ఆయన వెంట పశువైద్యాధికారి పీర్ అహ్మద్ ఉన్నారు.



ఆర్బీకే కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణ

మద్యం తాగి యువకుల హల్‌చల్

- వాహనాలు ఆపినందుకు పోలీసులతో వాగ్వివాదం
- అదుపులోకి తీసుకున్న పోలీసులు

మంగళగిరి: నగర పరిధిలోని కాజ టోల్ ప్లాజా వద్ద మద్యం మత్తులో యువకులు హల్‌చల్ చేశారు. పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... బుధవారం అర్ధ రాత్రి 2 గంటల సమయంలో రూరల్ పోలీసులు టోల్ ప్లాజా వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ భాగంగా వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. మంగళగిరి నుంచి గుంటూరు వైపు మూడు ద్విచక్రవాహనాలపై ఏడుగురు యువకులు వెళుతున్నారు. ఓన్‌వేలో వేగంగా వెళ్తుండగా గమనించిన పోలీసులు వారిని ఆపేందుకు ప్రయత్నించారు. రెండు వాహనాలు తప్పించుకోగా ఒక వాహనంపై వెళుతున్న ముగ్గురు యువకులను పోలీసులు పట్టుకున్నారు. యువకులు మద్యం తాగి ఉండడంతో వారిని స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నించారు. ఒక యువకుడు మీరెవరు మీరు పోలీసులేనా నకిలీ పోలీసులా అంటూ వారితో వాగ్వివాదానికి దిగి వారిపైకి దూసుకెళ్లాడు. పోలీసులు, యువకుల మధ్య వాదులాట పెరగడంతో ఎస్ఐ కలుగజేసుకుని స్టేషన్‌కు తరలించారు. యువకులను ఎస్ఐ దుర్భాషలాడి చేయి చేసుకున్నారని సోషల్ మీడియాలో గురువారం ఉదయం వైరల్ కావడం విశేషం. దీంతో ఉన్నతాధికారులు విచారించారు. తాము విదేశాలకు వెళ్లాలని కేసు నమోదైతే తమ భవిష్యత్ నాశనం అవుతుందని మధ్యవర్తులతో రాజీ చేయించడంతో యువకులను విడిచిపెట్టడం గమనార్హం.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభిస్తున్న బార్ కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్ సురేష్

తాడికొండ: తుళ్లూరు మండలం హైకోర్టు సమీపంలోని ఆటో స్టాండ్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏఐటియూసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బార్ కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్ పిఎస్పీ సురేష్, సతీమణి కమల, అడ్వకేట్ వరలక్ష్మీలు రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ వేసవిలో దాహార్తి తీర్చేందుకు ఆటో యూనియన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆటో వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ జెట్టి నరేష్, వైస్ ప్రెసిడెంట్ పైర్ల నాగమల్లేశ్వరరావు, పలువురు లాయర్లు పాల్గొన్నారు.